క్లుప్తంగా

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: తమ హోమియో ఆసుపత్రిలో యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వడిశలేరు ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. యోగాలో పోస్టు గ్రాడ్యుయేషన్ లేదా డిప్లమా చేసి అనుభవం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. నెలకు పురుష యోగా శిక్షకులు 32 గంటలు, మహిళా యోగా శిక్షకులు 20 గంటలు చొప్పున పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 83282 75475 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

రాజానగరం: మండలంలోని కానవరంలో నిర్మించిన ఆలయంలో వినాయకుడు, వారాహిమాత, దుర్గాభవాని విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు మంగళవారం విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 8.11 గంటలకు ఆగమ పండితుడు గోవిందరాజుల వెంకటశాస్త్రితో పాటు తిరుపతి దేవస్థానం పండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరుగుతుంది. గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తారు.

అనుమతి తప్పనిసరి

సీతానగరం: వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వినాయక విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనం విషయమై సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీహెచ్‌ఓ జయమణికి పురస్కారం



జయమణిని సత్కరిస్తున్న మదర్‌థెరిసా సొసైటీ ప్రతినిధులు

రంగంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి(సీహెచ్‌ఓ) కె.జయమణికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారం లభించింది. మంగళవారం విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో మదర్ థెరిసా సొసైటీ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జయమణి మాట్లాడుతూ విజయవాడకు చెందిన మదర్ థెరిసా సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత చక్రవర్తి, మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మగ్గం వర్క్‌లో శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో మంగళవారం మగ్గం వర్క్‌లో శిక్షణ ప్రారంభించారు. సుమారు 60 మంది ఈ శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. అవసరమైన మెటీరియల్ అందించి, శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇంతవరకూ తమ ఫౌండేషన్ ద్వారా సుమారు నాలుగు వేల మంది మహిళలు శిక్షణ పొంది, ఉపాధి అవకాశాలను పెంపొందించుకున్నారన్నారు. ఈ శిక్షణకు అల్లంపల్లి రూప ట్రైనీగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి

ప్రకాశం నగర్: గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాల్లో ప్రస్తుత ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరా నగర్‌లో మంగళవారం పార్టీ క్వారీ ఏరియా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కార్పొరేషన్ అధిక ఇంటి పన్నులను వసూలు చేస్తోందని, ఈ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ బిల్లులను తగ్గించాలన్నారు. వలంటీర్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని డీమార్ట్ సమీపంలో ఉన్న స్వర్ణ సింధూ ఏజెన్సీ గేటు సమీపంలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఈ మేరకు వీఆర్వో బాపనయ్య బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఒంటిపై నిక్కరు ధరించి ఉన్నాడు. దీనిపై ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 0883 2434173, 94407 96533 (ఇన్‌స్పెక్టర్) నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



ప్రత్యేక చట్టాలు తేవాలి

కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన సంఘటన బాధాకరం. ఇలాంటి ఘటనలు దేశంలో మరెక్కడా జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఎంతో బాధ్యతాయుతంగా రోగులకు వైద్య సేవలందించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరం. భవిష్యత్తులో ఇలాంటివి చేయాలంటేనే భయం పుట్టేలా నిందితులను శిక్షించాలి.

– డీహెచ్ ప్రత్యూష, వైద్యురాలు, పెద్దాడ పీహెచ్‌సీ





ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడేందుకు డాక్టర్లు ఉన్నారు. కానీ వైద్యులను కాపాడేందుకు ఎవ్వరూ లేకపోవడం బాధాకరం. విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై కోల్‌కతాలో జరిగిన ఘటన అందరికీ కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, సూర్రెడ్డి నర్సింగ్ హోమ్ అధినేత, పందలపాక

గడువు ముంచుకొస్తుంది

- ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకే అవకాశం
- సంక్షేమ పథకాలన్నింటికీ ప్రామాణికంగా ఈ-పంట



కైకవోలులో ఈ-పంట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు

పెదపూడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తూ అమలు చేసిన ఈ-క్రాప్ నమోదు రైతులకు వరంగా నిలుస్తుంది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు ఆలస్యంగా ప్రారంభమైంది. రైతులు వరిసాగును నాట్లు వేయడం, వెదజల్లు విధానాల్లో చేపట్టారు. ప్రస్తుతం ఈ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయశాఖాధికారులు శరవేగంగా కొనసాగిస్తున్నారు. సంక్షేమ పథకాలన్నింటికీ ప్రామాణికంగా తీసుకునే ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకే అవకాశమివ్వడంతో రైతులు త్వరపడాలని అధికారులు చెబుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో 46,567 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తి మండలంలో 9,550 ఎకరాలు, పెదపూడిలో 18,500, రంగంపేటలో 2,776, బిక్కవోలులో 15,741 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది.

ఈ-పంట నమోదుతో ప్రయోజనాలు

రైతులు తమ పంటను ఈ-పంటలో నమోదు చేయించుకుంటే పంట బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర కల్పించడం, సున్నా వడ్డీ అమలు, బ్యాంక్ రుణాలు, రాయితీపై ఎరువులు, పురుగుమందుల సరఫరా, రాయితీపై యంత్ర పరికరాలు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్ల మంజూరు సులభతరమవుతాయి. ఈ-పంటలో భాగంగా రైతు భరోసా కేంద్రంలో ప్రతి రైతు భూమి వివరాలు గ్రామం, సర్వే నంబర్, ఆధార్ వివరాలు నమోదు చేయించుకోవాలి. దీంతో పంట విక్రయించే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. ఈ-పంటలో భాగంగా కౌలు రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆయా ప్రాంతాల్లో పంటలు పండించే వివరాలు, వ్యవసాయశాఖ గ్రామ స్థాయి అసిస్టెంట్లు ఈ-పంట విధానంలో నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు.

అనపర్తి నియోజకవర్గంలో ఈ-పంట ప్రగతి సూచిక

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-పంట నమోదు పూర్తి	నమోదు శాతం
అనపర్తి	9,550	7,126	74
బిక్కవోలు	15,741	11,032	70
పెదపూడి	18,500	13,000	40
రంగంపేట	2,776	1,930	69
మొత్తం	46,567	33,088	

ఈ-పంటతో ఎంతో మేలు



ఈ-పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులంతా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. గ్రామంలో ఉన్న వ్యవసాయ సహాయకుల్ని కలిస్తే ఈ-క్రాప్ ప్రక్రియనంతా పూర్తి చేస్తారు. ఈ-పంట నమోదు మండలంలో 70 శాతం పూర్తయింది.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయశాఖాధికారి, పెదపూడి

బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు



రామేశ్వరంలో బాలికల సంరక్షణపై మాట్లాడుతున్న ఎస్‌ఐ రామారావు

పెదపూడి: బాలికల సంరక్షణ, భద్రతపై బాలబాలికలకు అవగాహన ఉండాలని పెదపూడి ఎస్‌ఐ కె.రామారావు అన్నారు. రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల చట్టాలు, సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామారావు మాట్లాడుతూ బాలికలు సోషల్ మీడియాలో ఫొటోలు పోస్టు చేయడం, ఆన్‌లైన్‌లో పరిచయం లేని వ్యక్తులతో ఫోన్లో మాట్లాడటం, చాటింగ్ చేయడం వంటివి చేయకూడదన్నారు. మైనర్ బాలికలతో ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే వారిపై పోక్సో కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తారన్నారు. రౌడీ షీటులు తెరుస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీఎస్ లక్ష్మి, సాములు, కె.సుధారాణి, కె.ప్రభాకర్‌రావు, పోలీసు సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేయాలని బీఎల్‌వోలకు అసిస్టెంట్ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో), తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మంగళవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణలకు అవకాశం కల్పిస్తూ ఎస్‌ఎస్‌ఆర్ (స్పెషల్ సమ్మరీ రివిజన్) 25 షెడ్యూల్ జారీ చేసిందన్నారు. దీంతో బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి, కొత్త ఓటర్లను గుర్తించడం, పేర్లు తప్పుగా పడితే వాటిని సవరించడం, మృతులను తొలగించడం, ఓటర్ల బదిలీ తదితర వాటిని నిర్వహించాలన్నారు. జూన్ 30 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 29న ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల చేస్తామని, అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకూ తెలపవచ్చన్నారు. అనంతరం వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు.

వైభవంగా శ్యామలాంబ జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు



కళాకారులతో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక వేంకటేశ్వరస్వామివారి మఠం వీధిలో కొలువైన శ్యామలాంబ అమ్మవారి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిల్లా వెంకన్న, ప్రధాన కార్యదర్శి వెల్లంకి జయరాం తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట వాకచర్ల కృష్ణ తదితరులున్నారు.

ఏఎస్‌డీ, ఆర్ట్స్ కళాశాలల ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న కళాశాలల అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల, కాకినాడ ఏఎస్‌డీ మహిళా కళాశాలలు రసాయన శాస్త్ర విభాగానికి సంబంధించి పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనిలో భాగంగా రసాయన శాస్త్ర విద్యార్థులకు బోధన, పరిశోధన తదితర అంశాలలో ఇరు కళాశాలల అధ్యాపకుల పరస్పర మార్పిడి ద్వారా సహకరించుకోనున్నాయి. ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులకు బోధన, పరిశోధన అంశాలపై ఆసక్తిని కలిగించడానికి ఈ అవగాహన ఒప్పందం సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇరు కళాశాలల రసాయనశాస్త్ర విభాగాధిపతులు టి.శ్రీనివాసరావు, డాక్టర్ అనిత, అధ్యాపకులు డాక్టర్ జె.సురేష్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా నందనోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యాపురంలోని రాధాకృష్ణ మందిరంలో మంగళవారం నందనోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు. శ్రీకృష్ణ చైతన్య మిషన్, ఆశ్రమం, గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీల త్రిదండి స్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహారాజ్, శ్రీల ఆచార్యదేవ త్రిదండి స్వామి భక్తి కమల గోవింద గోస్వామి మహారాజ్ ఆశీస్సులతో ఘనంగా ముగిశాయి. మందిర నిర్వాహకులు త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ పూజలు చేసిన అనంతరం నందోత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం



బలభద్రపురంలో సామూహికంగా మంగళగౌరీ వ్రతం చేస్తున్న మహిళలు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని వెలంపేట రామాలయం వద్ద మహిళలు సామూహికంగా మంగళగౌరీ వ్రతం నిర్వహించారు. అనపర్తి, మండపేట నియోజకవర్గాల బ్రహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకుని మంగళగౌరి వ్రతం పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వెలమలపల్లి హనుమంతరావుశర్మ మాట్లాడుతూ శ్రావణమాసంలో మహిళలు ఈ వ్రతం చేయడం వల్ల వారికి మాంగల్య బలం పెరుగుతుందన్నారు. పూజల్లో సంఘం అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గేదెల వీరబాబు, యూత్ అధ్యక్షుడు సలుమూరి అయ్యప్ప, కార్యదర్శి బొడ్డు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ భాషను కాపాడుకుందాం



గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు కాంతికృష్ణను సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: అమ్మ భాషను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతికృష్ణ పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరంలో కళాగౌతమి సాహిత్య సంస్థ 33 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో తాడితోటలో సంహిత కన్వెన్షన్ హాలులో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంతికృష్ణ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు భాష కోసం పడిన తాపత్రయంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. గిడుగు వారింట పుట్టడం తనకు చాలా గర్వకారణమన్నారు. పది నిమిషాల పాటు ఆంగ్ల పదం దొర్లకుండా తెలుగులో మాట్లాడిన వారికి నగదు బహుమతులు ఇస్తున్నామన్నారు. తెలుగు భాష స్థితిగతులపై వేదనతో గిడుగు వారికి లేఖ రాసే పోటీని ఆమె ప్రకటించారు. అందరూ లేఖలు రాసి పంపిస్తే గిన్నిస్ బుక్ లోకి ఎక్కే అవకాశం ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో 30 ఏళ్లకు పైగా సాహితీసేవ అందిస్తున్న సంస్థ కళాగౌతమికి అభినందనలు తెలిపారు. కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి, యువతను జాగృతం చేయడానికి, సంస్కృతీ సంప్రదాయాలను ముందుతరాలకు అందజేయడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కళాగౌతమి అధ్యక్షులు డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, సామాజికవేత్త లోలభట్టు శ్రీనివాసరాజు, ఫైర్ బీఎఫ్ శ్రీహరి జగన్నాథ్, అవధాని తాతా సత్యసందీప్, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, సంహిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ పాల్గొన్నారు.

యోగాకు మరింత ప్రోత్సాహం అవసరం



యోగాసన పోటీల విజేతలతో విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు మరింత ప్రోత్సాహం అందజేయాలని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఈస్ట్ గోదావరి ఆధ్వర్యంలో స్థానిక ఏపీ పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మంటపంలో మంగళవారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కృషితో ఒలింపిక్స్‌లో యోగాను ఒక క్రీడగా ప్రవేశపెట్టడం తథ్యమన్నారు. శ్రీధర్ రెడ్డి ఇటీవల యోగాలో గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా యోగా క్రీడాకారులు ప్రతిభ ప్రదర్శించాలని ఆకాంక్షించారు. నేషనల్ జడ్జి కర్రి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు ముగ్గురు క్రీడాకారులు గిన్నీస్ బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలిచిన యోగసన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. జడ్జిలుగా వ్యవహరించిన అనంతలక్ష్మి, జి.శ్రీనివాస్, బి.అరుణకుమార్, కె.హేమ నిర్మలారెడ్డి, శ్యామ్ సుందర్‌లకు కూడా సర్టిఫికెట్లు అందించారు.

పాత పెన్షన్ సాధించే వరకూ పోరాటం

రాజమహేంద్రవరం సిటీ: పాత పెన్షన్ విధానం సాధించే వరకూ పోరాటం సాగిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీ కె.విజయ కుమార్ అన్నారు. పాత పెన్షన్ విధానం స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను ప్రకటించడంపై కార్మికులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధనతో పాటు పలు సమస్యలు సాధించేందుకు కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వడానికి సిద్ధమవుతున్నామన్నారు. ఈ సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి యూపీఎస్‌పై స్పష్టమైన హామీ వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇతర న్యాయపరమైన కోర్కెలను నెరవేర్చేవరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీలు డి.శ్రీనివాసరెడ్డి, తిరుమలదేవ్, జగన్నాథరావు, చైర్మన్లు జయరాం, బాబు పాల్గొన్నారు.

108 రకాల పిండి వంటలతో నైవేద్యం



బిక్కవోలులో స్వామి వారికి సమర్పించిన 108 రకాల పిండి వంటలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన శ్రీలక్ష్మీనారాయణ స్వామికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం గ్రామంలోని మహిళలు స్వామివారికి వివిధ రకాల పిండి వంటలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అర్చకులు రాఘవరామ్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాస్కర్, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మంటపాలకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి పండగను అత్యంత జాగ్రత్తగా నిర్వహించే క్రమంలో మునిసిపల్, మండల స్థాయిలో అనుబంధ శాఖలతో సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. ఆగస్టు 30 లోగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్నారు. అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు.

కేసులను సత్వరం పరిష్కరించాలి

కంబాలచెరువు: కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి అన్నారు. ఆమె మంగళవారం ప్యానెల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కేసులలో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వాటిపై ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ కోసం వేసిన అర్జీల వివరాలు తెలుసుకున్నారు.

గోవింద క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు గాంధీపురం-4 లోని గోవింద క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు శ్రీకృష్ణునికి నవకలశ తిరుమంజనం (అభిషేకం), మధ్యాహ్నం 4 గంటలకు ఉట్టి ఉత్సవం, అనంతరం కోయిల్ తిరువాయ్ మొజి విన్నపం, విశేష ఆరగింపులు, సాంస్కృతిక కాలక్షేపం, ఊంజల్ సేవ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని అర్చకుడు తూపురాణి శ్రీమన్నారాయణాచార్యులు తెలిపారు.